
సాక్షి ఒడిశా

బుధవారం । 31 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,75,195లు. వచ్చాయని అధికారులు తెలిపారు.



సాగర తీరం.. మరింత సుందరం

రాష్ట్రంలోని గంజాం జిల్లా సోన్‌పూర్ బీచ్‌కు అంతర్జాతీయంగా హంగులు అద్దుతున్నారు.

- 8లో



రాష్ట్రంలో తొలి జంగిల్ సఫారీ

నగర శివారులోని చందక వన్యప్రాణుల అభయారణ్యం భరత్‌పూర్ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రిపూట పర్యటన సోమవారం ప్రారంభమైంది.

- 8లో

• కొడితే కొట్టాలిరా గోల్ కొట్టాలి







స్థానిక కళింగ స్టేడియం, రౌర్కెలా బిర్సా ముండా స్టేడియాల్లో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 25 వరకు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ హాకీ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణులు స్థానిక కళింగ స్టేడియంలో ముమ్మరంగా సాధన చేస్తున్నారు. – భువనేశ్వర్

న్యూస్‌రీల్

ఇసుక ట్రాక్టర్ బోల్తా

● ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ సంఘున్న

రాయగడ: ఇసుక ట్రాక్టర్ బోల్తాపడిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. జిల్లాలోని కాసీపూర్ సమితి పులొజొల గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనలో పుకిజొల గ్రామానికి చెందిన రొహిణి మాఝి(50) మృతి చెందగా, డ్రైవర్ సంఘున్న మాఝి (41), హెల్పరుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరవ్వడంతో, ఇళ్ల పనుల్లో భాగంగా సమీపంలోని నది నుంచి ఇసుకను తీసుకొస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మాఝి అక్కడికక్కడే మృతి చెందగా, క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత



అరెస్టైన వ్యక్తి, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గురలూర్ గ్రామ అడవిలో భారీగా గంజాయి పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. అడవిలో గంజాయి అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అయితే పోలీసుల రాకను గమనించిన గంజాయి మాఫియాకు సంబంధించిన వ్యక్తులు 23 బస్తాల్లో గంజాయిను వదిలి పరారయ్యారు. కాగా పరిసరాల్లో తిరుగుతున్న ఒక వ్యక్తి దీపక్ మాడీని అరెస్టు చేశారు. అతడిని ప్రశ్నించగా గంజాయిని ఆంధ్రకు తరలిస్తున్నట్లు తెలిపాడు. పట్టుబడిన గంజాయి 583 కిలోలు ఉంది. దీని విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

బరంపురం: నగరంలోని 16వ నంబర్ జాతీయ రహదారిలో టక్కులో అక్రమంగా రవాణా చేస్తున్న 240 కిలోల గంజాయిని సీజ్ చేశారు. బరంపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దామోధర్ పండా తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా మోహన అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరం మీదుగా ఉత్తరప్రదేశ్ వైపు వెళ్తున్న ట్రక్కుపై పుకిడిబొందా జంక్షన్ జాతీయ రహదారిలో ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు నేతృత్వంలో ఎక్సైజ్ బృందం సభ్యులు దాడులు చేశారు. దీనిలో రవాణా అవుతున్న 240 కిలోల గంజాయితో పాటు ట్రక్కుని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశారు. డ్రైవర్ ఉత్తరప్రదేశ్‌కి చెందిన మహ్మద్ రియాజ్‌గా అధికారులు గుర్తించారు.



బరంపురం: సీజ్ చేసిన గంజాయి

సత్తాచాటిన మన శకటం

● 75వ గణతంత్ర వేడుకల్లో ప్రదర్శన
● న్యాయ నిర్ణేతల విభాగంలో ప్రథమ బహుమతి

భువనేశ్వర్: జాతీయ 75వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో రాష్ట్ర కీర్తి తళుక్కుమంది. మహిళా సాధికారత, రఘురాజ్‌పూర్ వారసత్వ హస్తకళల గ్రామం, అత్యద్భుతమైన పట్టచిత్ర కళను ప్రదర్శించిన రాష్ట్ర శకటం కందర్ప హత్తి ఈ ఏడాది పరేడ్‌లో న్యాయనిర్ణేతల ఎంపిక విభాగంలో ప్రథమ బహుమతిని గెలుచుకున్నట్లు సమాచార పౌరసంబంధాల శాఖ సోమవారం తెలిపింది. అలాగే న్యాయనిర్ణేతల వర్గంలో గుజరాత్, తమిళనాడు నుంచి వచ్చిన శకటాలు వరుసగా ద్వితీయ మరియు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ ఏడాది జాతీయ గణతంత్ర దినోత్సవ ప్రదర్శనలో 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ శకటాలను ప్రదర్శనకు ప్రవేశపెట్టాయి. మూడేళ్ల విరామం తర్వాత పరేడ్‌లో సంబల్‌పురి నృత్యకారులతో కలిసి రాష్ట్రానికి చెందిన కందర్ప హత్తి శకటం కర్తవ్య పథంలోకి దూసుకెళ్లింది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక వేడుకలో ఈ బహుమతి ప్రదానం చేశారు.

కందర్ప హత్తి విశేషాలు

45 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు, 16 అడుగుల ఎత్తైన కందర్ప హత్తి శకటంలో రెండు భాగాలు ఉన్నాయి. ముందు భాగంలో కందర్ప హత్తి ప్రతిరూపం, వెనుక భాగంలో రఘురాజ్‌పూర్ గ్రామం మహిళల సాధికారిత దృశ్యం పొందుపరిచారు. కందర్ప హత్తి కృష్ణలీలని వర్ణించే ప్రసిద్ధ పట్టచిత్ర డిజైన్. దీనిలో తొమ్మిది మంది మహిళలు ఒకరితో ఒకరు అల్లుకుని ఏనుగు ఆకారంలో చిత్రీకరించారు. పూరీ జిల్లా రఘురాజ్‌పూర్ గ్రామంలోని మహిళా కళాకారుల సాధికారిత వెనుక భాగంలో ప్రతిబింబింపజేయడం విశేషం. హస్తకళలను ఆన్‌లైన్‌లో విక్రయించడంలో సాంకేతికత, వ్యవస్థాపక నైపుణ్యాలకు వారి అనుసరణను గుర్తిస్తూ పూరీ జిల్లా వారసత్వ హస్తకళల గ్రామం రఘురాజపూర్ మహిళల సాధికారిత అపురూపమైన కళా పరిరక్షణతో అంతర్జాతీయ విలువలను కూడగట్టుకుంటుందని ప్రముఖుల మన్ననలు పొందింది. వెనుక భాగంలో గ్రామ వారసత్వ గుడిసె ఉంది. ఇక్కడ పట్టచిత్రాలు, తొడుగులను రూపొందించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు. శకటంలో చోటుచేసుకున్న పెద్ద గొడుగు వికసిత్ భారత్ కార్యక్రమం కింద కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 'పూర్తి హృదయపూర్వక' మద్దతును సూచనగా నిలిచింది.



రాష్ట్రం ప్రదర్శించిన కందర్ప హత్తి శకటం

రెండుసార్లు బహుమతి

ప్రముఖ కళాకారులు గజేంద్ర సాహు, కీర్తి కిషోర్ మహరణలు ఈ శకటం రూపొందించారు. ఇటీవల కాలంలో ఒడిశా లింగరాజ్ దేవాలయం రుకుణ రథయాత్ర శకటం జాతీయ 71వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో న్యూఢిల్లీలో చివరిగా పాల్గొన్నప్పుడు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఇందులో లింగరాజ్ దేవాలయం, నంది, రుకుణ రథం ప్రతిరూపాలు ఉన్నాయి. ఈ శకటంతో ఒడిస్సీ కళాకారులు న్యూఢిల్లీ వీధుల్లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ లెక్కన రాష్ట్రం 2 సార్లు జాతీయ గణతంత్ర దినోత్సవ శకట ప్రదర్శనలో బహుమతి గెలుచుకోవడం విశేషం.



రాష్ట్ర శకటం కందర్ప హత్తి సాధించిన ప్రథమ బహుమతి



కేంద్ర పర్యటన శాఖ మంత్రి అజయ్ భట్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్న రాష్ట్ర ప్రతినిధులు



రాష్ట్రానికి వచ్చిన భారత ప్రభుత్వ ప్రశంసా పత్రం

బంద్ ప్రశాంతం



నబరంగ్‌పూర్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ అనుబంధ శాఖ యువ మోర్చా ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. జిల్లాకు రైల్వే లైన్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉమ్మర్ కోట్ పట్టణంలో ప్రభుత్వ కళాశాల, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు, ప్రభుత్వ 4వ స్థాయి ఉద్యోగుల నియామకం జిల్లాస్థాయిలోనే జరగాలనే డిమాండ్లతో బంద్ చేశారు. ముందస్తుగా చేసిన ప్రకటన వలన జిల్లావ్యాప్తంగా వర్తక వాణిజ్య, ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు మూతబడ్డాయి. మార్కెట్లు తెరచుకోలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు లక్ష్యం చేరుకొనేలోపే జిల్లాలో పలుచోట్ల నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీజేపీ శ్రేణులు ఎక్కడికక్కడే రోడ్లపై బైఠాయించి రాకపోకలు నిలిపివేశారు. ఆందోళనలో ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో, నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కునునాయక్, బీజేపీ నాయకులు గౌరీ శంకర్ మజ్జి, కనుదాస్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన సంరక్షణతో వ్యవసాయాభివృద్ధి



దండకారణ్య విత్తనాలు తిలకిస్తున్న ఈశ్వర్, సబర్మతి, రఘురాంలు

కొరాపుట్: పురాతన విత్తనాల సంరక్షణతో వ్యవసాయాభివృద్ధి జరుగుతుందని కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి తెలియజేశారు. స్థానిక నిశానిముండ మైదానంలో ప్రగత స్వచ్ఛంద సంస్థ మంగళవారం నిర్వహించిన రైతుల సమ్మేళ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో వందల సంవత్సరాల క్రితం విత్తనాలు ఇప్పటికీ గిరిజనులు సంరక్షిస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు కొరాపుట్ విత్తనాల సంరక్షణపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దండకారణ్యంలో అనేక గిరిజన తెగలు విత్తనాలను వారసత్వ సంపదగా రక్షిస్తున్న విషయం గుర్తు చేశారు. అంతకుముందు గిరిజనులు ప్రదర్శించిన వివిధ రకాల విత్తనాలు ఈశ్వర్ పాణిగ్రాహి బృందం పరిశీలించారు. కార్యక్రమంలో పద్మశ్రీ సబర్మతీ, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, ప్రగతి ప్రతినిధులు పాల్గొన్నారు.



విత్తనాలు ప్రదర్శిస్తున్న దండకారణ్య గిరిజన మహిళలు

బస్సు సేవలు పొడిగించాలని వినతి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి సిరిపాయి గ్రామానికి లక్ష్మీ బస్సు సేవలను పొడిగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు కొంతొమాఝికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సమితి కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో సిరిపాయి గ్రామం ఉంది. ఇటీవల ఈ గ్రామానికి పంచాయతీ నిధులు ద్వారా పక్కా రోడ్లు నిర్మించారని, రాకపోకలకు ఎటువంటి ఆటంకాలు లేవని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి సమితి అధ్యక్షుడు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించినవారిలో బీజేడీ సీనియర్ నాయకుడు వినోద్ నాయక్, లోక్‌నాథ్ నాయక్, ఛొబి గౌడో, దీనబంధు మాఝి తదితరులు ఉన్నారు.

విజిలెన్స్ వలలో జూనియర్ ఇంజినీర్



సంజయ్ కార్యాలయంలో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని నీటి పారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న సంజయ్ మహంతి విజిలెన్స్ వలకు చిక్కారు. అక్రమ ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఉదయం సంజయ్ కుమార్ మహంతి ఇల్లు, పనిచేస్తున్న కార్యాలయంపై ఏకకాలంలో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఇంటి వద్ద రూ.1.20 లక్షల నగదు, పలు బ్యాంక్ పాసు పుస్తకాలు, విలువైన పాత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సంజయ్ తల్లిదండ్రులు, అత్తమామలు నివాసముంటున్న భువనేశ్వర్‌లోని సొంత ప్లాట్, బాలేశ్వర్‌లో ఇళ్లపై సైతం దాడి చేశారు. సంజయ్‌పై తరుచూ ఫిర్యాదులు రావడంతో దాడులు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం విజిలెన్స్ అదుపులో సంజయ్ ఉన్నారు. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

మహానదిలో చిక్కుకున్న పడవ

● సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

భువనేశ్వర్: మహానదిలో ప్రయాణికుల పడవ చిక్కుకుంది. ఆ సమయంలో పడవలో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. కేంద్రాపడా జిల్లా మహాకల్పాడా మండలం బహకుద్ – ముషాడియా ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, మత్స్యకారుల సత్వర చర్యతో పెను ప్రమాదం తప్పింది. పడవలో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు.


సాంకేతిక లోపంతో...

మంగళవారం ఉదయం కేంద్రాపడా జిల్లా మహాకల్పాడా మండలం బహకుద్ – ముషాడియా ఫెర్రీ ఘాట్ ప్రాంతం నుంచి రెండు పడవలు 50 మంది పైన ప్రయాణికులతో బయల్దేరాయి. బహకుద్ ఘాట్ నుంచి పారాదీప్‌కు ఈ పడవలు బయల్దేరాయి. ఈ సమయంలో ఒక పడవ ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో నది మధ్యలో నిలిచిపోయింది. ప్రయాణికులతో నిండిన పడవల్లో మోటార్ సైకిళ్లు, స్కూటర్లు, సైకిళ్లు, ఇతర వస్తువులు సైతం రవాణా అవుతున్నాయి. దీంతో సుమారు 3 గంటలపాటు నది మధ్యలో చిక్కుకున్న ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గడిపారు. అనంతరం స్థానికులు, మత్స్యకారుల సహకారంతో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. కాగా గంటల తరబడి పడవలో చిక్కుకున్నా, బాధితుల బాగోగుల పర్యవేక్షణకు ప్రభుత్వ అధికార వర్గాల నుంచి ఏ ఒక్కరూ ఘటనా స్థలం సందర్శించక పోవడంపై సర్వత్రా విచారం వ్యక్తమయ్యింది. స్థానికుల సహకారమే లేకుంటే తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ప్రయాణికులు వాపోయారు. కేంద్రాపడా జిల్లా బహకుద్, ముషాడియా నివాసితులు తమ రోజువారీ పనుల కోసం నదిని దాటడానికి పడవపై ఆధారపడతారు.



పడవను స్థానికుల సాయంతో ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

ఎవరో వస్తారని ఎదురుచూడక..!



నదిపై నిర్మించుకున్న కర్ర వంతెన

రాయగడ: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడక గ్రామస్తులంతా ఏకమై నాగావళి నదిపై తాత్కాలిక కర్ర వంతెన నిర్మించుకొని రాకపోకలకు మార్గం సుగమమం చేసుకున్నారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీ పరిధి తొలొసజ్జా, ఉపొరొసజ్జ గ్రామాల నుంచి, నది అవతల వైపు ఉండే మరో ఏడు గ్రామాలకు ఈ వంతెన ద్వారా రాకపోకలకు వీలు కలిగింది. నది అవతల ఎరగెండ, మండిపొరొ, కుసుబటి, మజ్జిగుడ, నిమాజొల, కొటొలొపొదొరొ, రఘునాథ్‌పూర్ గ్రామాలు ఉన్నాయి. పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే మధ్యలో నాగావళి నదిని దాటుకుంటూ వెళ్లాల్సిందే. నదిపై వంతెన నిర్మించాలని జిల్లా యంత్రాంగం దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లినప్పటికీ పట్టించుకనే నాథుడే లేకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై సమీప అడవుల్లో లభించే కర్రలను తీసుకొచ్చి తాత్కాలిక కర్ర వంతెనను నిర్మించుకున్నారు. అయితే వర్షాకాలంలో నదీ ప్రవాహం ఎక్కువైతే వంతెన కొట్టుకుపోయే పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ మిగతా రోజుల్లోనైనా తమకు రాకపోకలు కలుగుతాయనే ఉద్దేశంతో ఈ వంతెనను నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు నదిపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



మరణించిన పూర్ణ కిరసాని

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి సమీపంలో బిరిగుడ వంతెన వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన వ్యక్తి బొయిపరిగుడ సమీపంలోని మాలిగుడ గ్రామానికి చెందిన పూర్ణ కిరసాని(30)గా గుర్తించారు. ఆయన ప్రస్తుతం కుంద్రా సమితి మొసిగాం సమీపంలోని టటుగుడ గ్రామంలో కుటుంబ సమేతంగా నివాసముంటున్నాడు. అయితే మంగళవారం ఉదయం పూర్ణ కిరసాని ఏదో పనిమీద తన ద్విచక్ర వాహనంపై బలియ మార్గంలో జయపురం బయల్దేరాడు. ఆ సమయంలో బిరిగుడ వంతెన సమీపంలో అతి వేగంగా ఎదురుగా వస్తున్న బైక్, పూర్ణ బైక్‌లు ఢీకొన్నాయి. ఘటనలో ప్రమాద స్థలంలోనే పూర్ణ కిరసాని మరణించాడు. మరో బైక్‌పై వస్తున్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడినవారిలో ఒకరు బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ కాత్రకుండ గురుగుండ, మరో వ్యక్తి సుకురు గొలారికి చెందిన వారు. ప్రమాద సమాచారం తెలియడంతో బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను తన వాహనంలో బొయిపరిగుడ ఆస్పత్రిలో చేర్చారు. గురుగుండ పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీధర్

జయపురం: ఒక ప్రైవేటు బస్సును వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జయపురం సమితి పుత్ర గ్రామానికి చెందిన శ్రీధర్ హరిజన్, అతడి భార్య, కుమార్తెలు ద్విచక్ర వాహనంపై భవానీపట్న వెళ్తున్న సమయంలో 26వ నంబర్ జాతీయ రహదారి జయపురం సమితి అంబాగుడ బీజే2 వద్ద వెనుక నుంచి బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్నవారు ఎగరిపడ్డారు. ఘటనలో శ్రీధర్ తలకు గట్టి దెబ్బ తగిలింది. అతడి భార్య, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద వార్త తెలిసిన పోలీసులు, స్థానికులు గాయపడిన వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అంబాగుడ పోలీసు పంటి అధికారి రవీంద్ర కుమార్ రథ్ ట్రాఫిక్‌ను నియంత్రించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద అబ్కారీ శాఖ అధికారులు మంగళవారం నిర్వహించిన దాడుల్లో ఒక యువకుడి నుంచి 10.175 కిలోల గంజాయి పట్టుబడింది. అరెస్టైన వ్యక్తి పశ్చిమ బెంగాల్‌కు చెందిన నజీర్‌పూర్ ప్రాంతానికి చెందిన నిమాని బరూయ్ (23)గా అధికారులు గుర్తించారు. ఎప్పటిలాగే అబ్కారి సిబ్బంది కొత్త బస్టాండ్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన బరూయ్‌ని ఆపి తనిఖీ చేయగా, అతని వద్ద గంజాయి పట్టుబడిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ దాస్ తెలియజేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో ఉన్నట్లు ఈ నెల 24న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు 108 సహాయంతో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని వివరాలకోసం విచారణ చేపడుతున్నామని చెప్పారు. ఎవరికైనా తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సాగర తీరం.. మరింత సుందరం

- సోన్‌పూర్ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు
- మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు
- దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు
- పర్యాటకులకు సురక్షిత ఏర్పాట్లు



గంజాం సోన్‌పూర్ బ్లూ ఫ్లాగ్ బీచ్ సోయగం

భువనేశ్వర్: రాష్ట్రంలోని గంజాం జిల్లా సోన్‌పూర్ బీచ్‌కు అంతర్జాతీయంగా హంగులు అద్దుతున్నారు. ఈ బీచ్ 2023-24 అంతర్జాతీయ బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందింది. ఈ గుర్తింపు సాధించడం ఒడిశా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఐసీజెడ్‌ఎంపీ), జిల్లా బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ, గంజాం మరియు స్థానిక సంఘం సమష్టి కృషికి నిదర్శనమని అటవీ శాఖ తెలిపింది. గంజాం సోనాపూర్ బీచ్ అధికారికంగా 2వ బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా మారింది. ఈ గుర్తింపు గంజాం జిల్లాలో పర్యాటకానికి పెద్ద ఊపునిస్తుంది. సోనాపూర్ బీచ్ ఇప్పుడు సహజమైన అందానికి గమ్యస్థానంగా పర్యాటకులను ఆకట్టుకుంటోంది. స్థిరమైన తీరప్రాంత పర్యాటకానికి ఒక నమూనాగా నిలుస్తోంది.

అంతర్జాతీయంగా గుర్తింపు

ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ డెన్మార్క్ అనే అంతర్జాతీయ సంస్థ సాగర తీరాలకు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు మంజూరు చేస్తుంది. నాలుగు ప్రధాన విభాగాల్లో 33 కఠినమైన ప్రామాణికాల ఆధారంగా బ్లూ ఫ్లాగ్ గుర్తింపు లభిస్తుంది. పర్యావరణ విద్య, సమాచారం, స్నానపు నీటి నాణ్యత, పర్యావరణ నిర్వహణ, పరిరక్షణ, బీచ్‌లో భద్రత, సేవలు ప్రధాన ప్రామాణికాలుగా పరిగణిస్తారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో పర్యటన పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఐసీజెడ్‌ఎంపీ) కింద సోన్‌పూర్ బీచ్ అభివృద్ధికి సంబంధించిన పనులు 2021 సంవత్సరంలో ప్రారంభించి, 2 ఏళ్ల స్వల్ప వ్యవధిలో 2023 సంవత్సరానికి పూర్తి చేశారు.

సువిశాల సాగర తీరం

సోన్‌పూర్ బ్లూ ఫ్లాగ్ బీచ్ 800 మీటర్లకు పైగా విస్తరించి ఉంది. ఈ తీరంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చక్రాల కుర్చీల సౌకర్యం కల్పిస్తోంది. జీరో లిక్విడ్ వేస్ట్ డిశ్చార్జ్, లైఫ్‌గార్డ్ టవర్లు, ప్రథమ చికిత్స కోసం శిక్షణ పొందిన పారామెడిక్ సిబ్బంది, బీచ్ పర్యాటక ప్రాంతం పటిష్టమైన సీసీటీవీ నిఘా పర్యవేక్షణలో ఉంటుంది. ఈ వ్యవహారాలను గంజాం జిల్లా బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ నిర్వహిస్తుంది. క్లబ్ మహీంద్రా ఇక్కడ ఒక విలాసవంతమైన రిసార్ట్‌ను నిర్మించడానికి రూ.228 కోట్లు పెట్టుబడి పెడుతోంది. సోన్‌పూర్ సాగర తీరానికి బ్లూ ఫ్లాగ్ గుర్తింపు లభించడంతో ఈ ప్రాంతంలో మరిన్ని పర్యాటక ఆకర్షిత సౌకర్యాలు చకచకా అందుబాటులోకి వస్తాయని పర్యాటక శాఖ వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి.



సోన్‌పూర్ సాగర తీరం



సోన్‌పూర్ తీరంలో పర్యాటకులు



జాతీయ రహదారిని కలుపుతూ నిర్మిస్తున్న రోడ్డు

రాష్ట్రంలో తొలి జంగిల్ సఫారీ



జంగిల్ సఫారీ ప్రారంభిస్తున్న సుశాంత నందో



వాహనంలో విద్యార్థులను తీసుకెళ్తున్న దృశ్యం

- భరత్‌పూర్ అభయారణ్యంలో రాత్రిపూట పర్యటన



అడవిలో సంచరిస్తున్న జింక



భరత్‌పూర్ జంగిల్ సఫారీ ప్రారంభోత్సవ సభ

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి జంగిల్ సఫారీ ప్రారంభించారు. నగర శివారులోని చందక వన్యప్రాణుల అభయారణ్యం భరత్‌పూర్ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రిపూట పర్యటన ప్రారంభమైంది. ప్రారంభోత్సవం పురస్కరించుకుని నగరంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు రాత్రిపూట అభయారణ్యంలో పర్యటించారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వన్యప్రాణి) సుశాంత నొందొ పచ్చ జెండా ఊపి నైట్ ట్రయల్ వాహనాలను ప్రారంభించారు. ఈ వాహనాల్లో కిస్, సాయి ఇంటర్నేషనల్, డీఏవీ చంద్రశేఖర్‌పూర్, సీఆర్‌పీఎఫ్ క్యాంపస్, చంద్రశేఖర్‌పూర్ కేంద్రీయ విద్యాలయాలు, త్రివేణి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాత్రి పర్యటన సురక్షితం

విద్యార్థులు సురక్షితమైన దూరం నుంచి ఏనుగు, జింక, అడవి పంది, కుందేలు వంటి వన్యప్రాణుల రాత్రిపూట సంచారం ప్రత్యక్షంగా తిలకించారు. చందక-డొంపాడా వన్యప్రాణుల అభయారణ్యంలో కనిపించే వివిధ జాతుల వన్య ప్రాణుల వివరాలను చందకా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) శరత్ చంద్ర బెహెరా విద్యార్థులకు వివరించారు.

వారానికి 3 రోజులు

భరత్‌పూర్ అడవిలో రాత్రి ట్రయల్ 3 రోజుల పాటు అందుబాటులో ఉంటుంది. బాగోగులను సమీక్షించిన మేరకు అంచెలంచెలుగా నిడివి విస్తరణకు యోచిస్తున్నట్లు అధికారి తెలిపారు. ప్రస్తుతం సోమవారం, గురువారం మరియు శనివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య జంగిల్ సఫారీ సందర్శన వేళలుగా ప్రకటించారు. మొదటి స్లాట్‌లోని ట్రయల్ సాయంత్రం 6 గంటలకు, రెండవది రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. ఒక్కో స్లాట్‌లో రెండు వాహనాలను వినియోగించనున్నారు. ఈ విధానంలో వన్యప్రాణులకు ఇబ్బంది కలగకపోతే వాహనాల సంఖ్యతో స్లాట్‌ల సంఖ్యను పెంచుతామని డీఎఫ్‌వో తెలిపారు.

సువిశాల విస్తీర్ణం

194 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న చందక - డొంపాడా అభయారణ్యంలో ఏనుగులు, మొరిగే జింకలు, పందికొక్కులతో సహా అనేక వన్యప్రాణులు ఉన్నాయి. ఇప్పటికే వందలాది జింకలను జంగిల్ సఫారీ ప్రదేశానికి తరలించారు. వన్యప్రాణుల ఆవాసాలను సుసంపన్నం చేసేందుకు సాంబార్ మరియు గౌర్‌లను ప్రవేశపెట్టే యోచన ఉన్నట్లు పేర్కొన్నారు. భరత్‌పూర్ అభయారణ్యంలో రాత్రిపూట జంగిల్ సఫారీలో పాల్గొన్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. చీకటి సమయంలో జింక వంటి వన్య ప్రాణుల కదలిక ప్రత్యక్షంగా తిలకించడం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. రాత్రి నిశ్శబ్దంలో ప్రకాశవంతమైన బంగారు వన్నెతో నక్షత్రాలా మిరుమిట్లు గొలిపే కళ్లతో చంద్రుని కాంతి ఛాయల్లో జింక సంచారం అత్యద్భుతమని ముచ్చటపడ్డారు. మరోవైపు చిమ్మ చీకటి సమయంలో గజరాజుల సంచారం, ఘీంకారం ఒక్కసారిగా గగుర్పొడిచిందని బాలలు తెలిపారు.

గాంధీ మార్గం అనుసరణీయం



కొరాపుట్: నబరంగ్‌పూర్ కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

యువత మహాత్మాగాంధీ ఆశయ సాధన, ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని వక్తలు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. మహాత్ముని అడుగు జాడల్లో నడవమే ఆయనకు మనమిచ్చే నివాళి అన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ రఘుబర దాస్



భువనేశ్వర్: మహాత్మాగాంధీ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



జయపురం: మాట్లాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మహంతి



జయపురం: మహాత్ముని విగ్రహానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ తదితరులు

నేడు జగన్నాథుని శ్రీముఖ సింగారం

- దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయాన్ని బుధవారం ప్రత్యేక సేవల కోసం మూడు గంటల పాటు మూసివేయనున్నారు. ఈ వ్యవధిలో భక్తులకు సర్వదర్శనం లభించదని ఆలయ అధికార వర్గం తెలిపింది. ఈ మేరకు (ఎస్‌జేటీఏ) మంగళవారం జారీ చేసిన సమాచారం ప్రకారం.. బుధవారం ఆలయం లోపల జగన్నాథుడు, బలభద్రుడు మరియు దేవి సుభద్ర మూల విరాటుల శ్రీముఖ సింగారం (బొనొకొ లగ్గి) సేవ నిర్వహిస్తారు. ఆలయ ఆచారాల్లో భాగంగా ఈ సేవ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ద్వితీయ భోగ మండపం సేవ తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగనుంది. ఈ సమయంలో సేవాయత్‌లు (సేవకులు) ఆలయ గర్భగుడిలో దేవతల ముఖ అలంకరణ చేస్తారు. సంప్రదాయం ప్రకారం ఎంపిక చేసిన సేవకుల సమూహం ద్వారా ముఖ అలంకరణ రహస్యంగా నిర్వహించబడుతుంది. ఇదో గోప్య సేవ కావడంతో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులు ఆలయంలోకి ప్రవేశించకుండా నిషేధించబడుతుందని ఎస్‌జేటీఏ పేర్కొంది. శ్రీముఖ సింగారానికి వన మూలికలు, కస్తూరి, హరితల్, కర్పూరం, కేశర్, నల్ల శంఖం, ధవల శంఖం పొడి వంటి ఇతర ప్రత్యేక పదార్థాలతో శ్రీముఖ అలంకరణకు అవసరమైన సంరజామా చేస్తారు. సాధారణంగా ఇది సంవత్సరానికి 8 సార్లు నిర్వహిస్తారు.

బాధ్యతల స్వీకరణ

రాయగడ: జిల్లా నూతన ఎస్పీగా హరీష్ బి.సి సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించిన వివేకానంద శర్మ బాధ్యతలను హరీష్‌కు అప్పగించారు. ఈయన ఇదివరకు కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్ ఎస్డీపీవోగా విధులు నిర్వహిస్తుండేవారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ హరీష్ తెలియజేశారు.



ఎస్పీ హరీష్ (ఫైల్)

భక్తగిరి



కొండపై గర్భగుడిలో పూజలందుకుంటున్న మేరిమాత

- కనులపండువగా సాగిన మరియగిరి యాత్ర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తజనం
- కులమతాలకు అతీతంగా మొక్కుల చెల్లింపు
- మరియమ్మ స్తోత్రంతో మారు మోగిన మరియగిరి ప్రాంతం
- ప్రత్యేక దివ్యపూజలుచేసిన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి విజయకుమార్

వీరఘట్టం: శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మేరిమాత మహోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. వీరఘట్టం సమీపంలోని యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మరియమ్మ(మేరిమాత)కు శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయరాల విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యపూజలు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన సుమారు 40వేల మంది భక్తులు, ఆరాధకులు పూజల్లో పాల్గొన్నారు. మేరిమాతను దర్శించి మొక్కుబడులు చెల్లించారు. కులమతాలకు అతీతంగా మేరిమాతను దర్శించుకునేందుకు వచ్చిన భక్తజనంతో మరియగిరి పులకించింది. మేరిమాత స్తోత్రం మారుమోగింది. కొత్తగా సిద్ధం చేసిన మేరిమాత విగ్రహాలను పలు గురు మండలాల చర్చిలకు బిషప్ అందజేశారు.



దివ్యపూజలో ప్రార్థన చేస్తున్న బిషప్ విజయ్‌కుమార్

బహుమతుల ప్రదానం

సహాయమాత మహోత్సవం సందర్భంగా వీరఘట్టం, చిట్టపుడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురుమండలాల్లో ఇటీవల నిర్వహించిన బైబిల్ పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పీఠాధిపతులు, మఠకన్యలు, క్రైస్తవ పెద్దలు మరియగిరి ఉత్సవ కమిటీ పూజల్లో పాల్గొన్నారు.

గట్టి బందోబస్తు

మరియగిరి యాత్రకు గతేడాది కంటే రెండింతలు భక్తులు ఎక్కువగా రావడంతో పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో పాలకొండ సీఐ చంద్రమౌళీ, వీరఘట్టం, సీతంపేట, దోనుబాయి ఎస్ఐ, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. భక్తుల రాకపోకలకు వీలుగా పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం డిపోల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపారు.



దివ్యపూజలో అధిక సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవ భక్తులు



మరియగిరి కొండపై కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



మేరిమాతను దర్శించుకునేందుకు తండోపతండాలుగా కొండపైకి వెలుతున్న భక్తులు

క్లుప్తంగా

సమస్యల ఏకరువు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని మంగళవారం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా సోషల్‌వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, సభ్యులుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.తారకరామారావు, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్‌ను నియమించారు. గత వీసీ కాలంలో తొలగించిన 12 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఫిర్యాదు చేశారు. 23 మందిని తొలగించి నచ్చిన వారిని కొనసాగించారని, నచ్చని వారిని తొలగించారని వీరు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని, వీసికి దృష్టికి తీసుకెళ్తామని కమిటీ తెలియజేసింది. 34 నాన్ టీచింగ్ ఔట్ సోర్సింగ్ పోస్టులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు జరగలేదని పలువురు ఫిర్యాదు చేయగా.. వీసీ నిర్ణయం తీసుకుంటారని రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు.

కొనసాగుతున్న జేఈఈ ఆన్‌లైన్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు కేంద్రాల్లో జేఈఈ ఆన్‌లైన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100 కి 99, రెండో షిఫ్ట్‌లో 100 కి 98, చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100 కి 99, రెండో షిఫ్ట్‌లో 100 కి 99 హాజరయ్యారు. 400 మందికి 393 మంది హాజరయ్యారు. 27వ తేదీ నుంచి ఇప్పటి వరకు 1200 మందికి 1187 మంది హాజరయ్యారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సత్కరిస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను వైద్యారోగ్య శాఖ సిబ్బంది మంగళవారం సత్కరించారు. కలెక్టర్ బదిలీపై వెళ్లిపోతున్న నేపథ్యంలో ఆయనను కలిసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ఆ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో కొందరు సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం చేస్తున్నట్లు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో విశాఖ న్యూపోర్ట్ క్రైమ్, ద్వారకా క్రైమ్ స్టేషన్ల నుంచి గొండెల ప్రసాద్, బి.నిహార్‌లు మన జిల్లాకు రానుండగా.. ఇక్కడి నుంచి అరిలోవ, పెందుర్తి లాఅండ్‌ఆర్డర్ పీఎస్‌లకు వై.కృష్ణ, వై సింహాచలంలు బదిలీపై వెళ్లనున్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల సమ్మె నోటీసు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు మంగళవారం డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ డి.విద్యాసాగర్‌కి సమ్మెనోటీసును అందజేశారు. సెర్ప్ సీఈఓ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని వారు కోరారు. పలు సార్లు సెర్ప్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. నోటీసు ఇచ్చిన వారిలో డీఆర్‌డీఏ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు చింతాడ రామ్మోహన్‌రావు, నారాయణరావు, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌గా శ్రీకేష్ బి.లాఠకర్ సేవలు నిరుపమానం



శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్‌గా శ్రీకేష్ బి.లాఠకర్ నిరుపమాన సేవలు అందించారని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌ను ఆయన మంగళవారం కలిసి శాలువతో సత్కరించారు. ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశాలైన నవరత్నాల పథకాలు అమలు చేయడంలోనూ, జిల్లాలో చేపట్టిన కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ముఖ్యంగా కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి నిర్మాణం, ఉద్దానం రక్షిత మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు విషయంలో ప్రత్యేక చొరవ చూపారన్నారు. సమగ్ర భూ సమగ్ర సర్వే, ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేశారని ప్రశంసించారు. ఐఏఎస్‌గా ఉన్నత స్థానంలో ఎక్కడ పనిచేసినా జిల్లాపై ఇవే ప్రేమాభిమానాలు కురిపించాలని కృష్ణదాస్ కోరారు.

ఘన వీడ్కోలు

బదిలీపై వెళ్లిపోతున్న కలెక్టర్‌ను శ్రీకాకుళంలోని బృందావనం కన్వెన్షన్‌లో జిల్లా అధికారుల, రెవెన్యూ అసోసియేషన్, ఉద్యోగ సంఘాలు ఘనంగా సత్కరించాయి. జిల్లా వాసులకు ఆయన చిరకాలం గుర్తుంటారని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఐటీడీఏ పీఓ పీఓ కల్పన కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు.

కళకు సత్కారం



బండారు చిట్టిబాబు, పిరియా చలపతిరావు, సాంఘిక నటులు | తర్రా ఆదినారాయణ, గాయకులు | అర్జంగి లింగమూర్తి, పౌరాణిక నటులు | రఘుపాత్రుని శ్రీకాంత్, నృత్య దర్శకులు

- అక్కినేని పురస్కారాలకు ఐదుగురి ఎంపిక
- ఫిబ్రవరి 3న పురస్కారాల అందజేత
- ఏర్పాట్లు చేస్తున్న శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య

శ్రీకాకుళం కల్చరల్: అక్కినేని కళాపురస్కారాలకు అంతా సిద్ధమైంది. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించే నెలవారీ కార్యక్రమంలో యువకళావాహినీ హైదరాబాద్ వారి సౌజన్యంతో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళా పురస్కారాలు అందించనున్నట్లు అధ్యక్షులు చిట్టి వేంకటరావు, గౌరవ అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి, కార్య నిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి బంటుపల్లి రామచంద్రదేవ్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. అవార్డుల కోసం ఐదుగురిని ఎంపిక చేశామని, బాపూజీ కళామందిర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. లలిత సంగీతంలో బండారు చిట్టిబాబు, గాయకులు తర్రా ఆదినారాయణ, సాంఘిక నటులు పిరియా చలపతి, నృత్య దర్శకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్‌లను ఈ పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు.

స్వర ఝరి

శ్రీకాకుళానికి చెందిన బండారు చిట్టిబాబు పేరు సంగీత లోకంలో అందరికీ పరిచయమే. ఆయన వద్ద ఎంతో మంది సంగీతం నేర్చుకున్నారు. వారిలో ప్రముఖ సినీ గాయకుడు జి.ఆనంద్, మండపాక శారద, భారతీ రమేష్‌లు ఉన్నారు. పెండ్యాల నాగేశ్వరరావు, కోటి లాంటి సంగీత దర్శకులతో కలిసి ఆయన పనిచేశారు. ఇప్పుడంతా ఎలక్ట్రానిక్ యుగమే అయినా ఆయన హార్మోనియంతోనే ఇంకా పని చేస్తున్నారు. ఇప్పటికీ ఆయన యువ గాయకులను తయారు చేస్తున్నారు.

రంగస్థలంపై..

రంగస్థలంపై 40 ఏళ్ల అనుభవం ఉన్న నటుడు, గాయకుడు, సంగీత దర్శకుడు తర్రా ఆదినారాయణ. పెద్ద దువగాం గ్రామానికి చెందిన ఆయన నవరస నటనా వైదుష్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగలరు. విజయనగరం సంగీత కళాశాలలో గాత్ర సంగీతం అభ్యసించి, పౌరాణిక నాటకాల్లో షణ్ముఖఆంజనేయరాజు, సుభద్రరాజు, నాగేశ్వరరావు, పీసపాటి, ఆకెళ్ల, వసుంధరాదేవి వంటి ప్రముఖుల సరసన నారదుడు, లోహితాస్యుడు, వికర్ణుడు, అభిమన్యుడిగా నటించి ప్రశంసలు పొందారు. ఒకప్పటి ముఖ్య మంత్రి కాసుబ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

> **దేశవిదేశాల్లో ఖ్యాతి**
>
> శ్రీకాకుళానికి చెందిన శ్రీకాంత్ శివశ్రీనృత్య కళా నికేతన్ ద్వారా దేశవిదేశాల్లో ఖ్యాతినార్జించారు. కూచిపూడి నృత్య విభాగంలో ఎన్నో రీతులు, మరెన్నో బాలేలు నిర్వహించారు. ఈ నృత్యకళానికేతన్ ద్వారా ఆసక్తి ఉన్న ఎందరో పేద విద్యార్థులకు నృత్యం నేర్పిస్తున్నారు. ఆయన వద్ద 400 మంది నృత్యం నేర్చుకున్నారు. టీవీల్లో కూడా పలు కార్యక్రమాలకు కొరియోగ్రాఫ్ చేశారు.

నిఖార్సైన నటుడు

నాటక రంగంలో నిఖార్సైన నటుడు పిరియా చలపతిరావు. ఆయన స్వగ్రామం కవిటి మండలంలోని బి.గొనపపుట్టుగ. పాఠశాల స్థాయిలో మొదటిగా పిసినారి నాటికతో రంగ ప్రవేశం చేశారు. తర్వాత గ్రామాల్లో నాటికల్లో నటించడం మొదలుపెట్టారు. 350 పరిషత్ నాటికల్లో ఉత్తమ నటుడు, 10 ఉత్తమ విలన్‌గా, 5 ఉత్తమ హాస్యనటుడుగా, అవార్డులు సినీ నటులు కాంతారావు, మురళీమోహన్, దాసరి నారాయణరావు, సుమన్, తణికెళ్ల భరణి చేతుల మీదుగా అందుకున్నారు. నంది నాటకోత్సవాల్లో కూడా పలు మార్లు నంది బహుమతులు అందుకున్నారు.

పౌరాణికాల్లో..

హిరమండలం మండలం మహాలక్ష్మీపురం కాలనీకి చెందిన అర్జంగి లింగమూర్తి గత 38 ఏళ్లుగా పౌరాణిక నటులుగా రాణిస్తున్నారు. 1986లో మొదటిసారిగా కాటిసీనులో హరిశ్చంద్ర పాత్రధారిగా రంగ ప్రవేశం చేశారు. 2వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. సత్యహరిశ్చంద్రతో పాటుగా గయుడు, యయాతి, ధర్మరాజు, బిల్వమంగళుడి పాత్రల్లో జీవించారు. 2000లో యడ్ల గోపాలరావు చేతుల మీదుగా కిరీట సన్మానం జరిగింది.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆడిటోరియం ప్రారంభం



టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూతన ఆడిటోరియంను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్,

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఏపీజే అబ్దుల్‌కలాం ఆడిటోరియంను మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రారంభించారు. ముందుగా టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కలెక్టర్‌ను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. అనంతరం ఆడిటోరియం శిలాఫలకాన్ని ప్రారంభించారు. కాన్ఫరెన్స్ హాల్‌తో పాటు గ్రంథాలయానికి అనుకూలంగా నిర్మాణం చేసిన ఆడిటోరియంలో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సహాయ కలెక్టర్ రాఘవేంద్రమీనా, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు, తహసీల్దారు ప్రవల్లిక తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘పొగాకు ఉత్పత్తులు పూర్తిగా నిషిద్ధం’



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పోలీసు, ఆరోగ్య, విద్యాశాఖాధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పొగాకు ఉత్పత్తులు పూర్తిస్థాయిలో నిషేధించాలని, విద్యాసంస్థలకు వందమీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పొగాకు ఉత్పత్తుల చట్టాన్ని (సిఎటిపిఓ) ప్రభావవంతంగా అమలు చేస్తామని జిల్లా అదనపు ఎస్పీలు జె.తిప్పేస్వామి (అడ్మిన్), టీపీ విఠలేశ్వరరావులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజారోగ్య శాఖ, జాతీయ పొగాకు నియంత్రణ మండలి (ఎన్‌టీసీపీ) మార్గనిర్దేశకాలతో ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు అదనపు ఎస్పీలు హెల్త్ ఫౌండేషన్ వారి సహకారంతో సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అదనపు ఎస్పీ తిప్పేస్వామి మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా మన రాష్ట్రంలో సంవత్సరానికి 48 వేల మరణాలు సంభవిస్తున్నాయని, కాట్పాపై నిర్వహించిన ఈ శిక్షణ పోలీసులు చట్టాన్ని సమర్థంగా అమలుచేసేందుకు దోహదపడుతుందన్నారు. కాట్పా చట్టంలోని 6(బి) ప్రకారం విద్యాసంస్థలకు వంద మీటర్లలోపు విక్రయించడం నిషేధమన్నారు. ఇప్పటికే ఎస్పీ రాధిక జిల్లాలోని అన్ని పీఎస్‌లలో నోస్మోకింగ్ బోర్డులను ఏర్పాటుచేయాలని ఆదేశించారన్నారు. అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు మాట్లాడుతే పిల్లలు ఎక్కువగా ఈ ఉత్పత్తులపై బానిసలవుతున్నారని, జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం మత్తు కలిగించే పదార్థాలు, మద్యం, పొగాకు, సైకోట్రోపిక్ పదార్థాలు కలిగిన ఉత్పత్తులు పిల్లలకు అమ్మితే వారికి ఏడేళ్లవరకు కఠిన కారాగార శిక్షే కాక రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందన్నారు. జిల్లా అదనపు వైద్యారోగ్యాధికారి డాక్టర్ అనురాధ మాట్లాడుతూ గ్లోబల్ యూత్ టొబాకో సర్వే ఫలితాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో 13 నుంచి 15 ఏళ్ల వారు 33.6 శాతం వినియోగదారులుగా ఉన్నారని, ఉత్పత్తుల ప్రాబల్యం తగ్గించడానికి ఆరోగ్య, విద్యాశాఖలు అన్ని జిల్లాల్లో పొగాకు రహిత విద్యాసంస్థ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అనంతరం పొగాకు ఉత్పత్తుల వాడకం నిషేధం అని తెలిపే గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, ఎస్.వాసుదేవ్, విజయ్‌కుమార్, డీఈవో వెంకటేశ్వరరావు, పోలీసు అధికారులు, వైద్య శాఖాధికారులు, హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురు చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: మండలంలోని విజయ దుర్గా ఆటో యూనియన్‌కు చెందిన టీడీపీ నాయకులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త పిరియా విజయ సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సోంపేట పట్టణంలో విజయ దుర్గా ఆటోయూనియన్, లగేజ్ యూనియన్, టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దుర్గా గుడి సమీపంలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ నుంచి గార ప్రతాప్, గేదెల ప్రతాప్, జి.సంతోష్, జి.శ్యామ్, పి.సురేష్, బి.శంకర్, బి.శేఖర్, పి.కాలీ, బి.లక్ష్మణరావు, ఎస్.సోమేశ్, జి.ధనుంజయరావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, పార్టీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రాతు విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్న నక్క బాలకృష్ణ

నందిగాం: మండలంలోని మద్దిలో డిపేట జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాంకు చెందిన నక్క బాలకృష్ణ (38) గాయపడ్డారు. స్థానిక బీసీ కాలనీలో వెల్డింగ్ పనులు చేసుకునే బాలకృష్ణ పెద్దతామరాపల్లిలో పని చూసుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా మద్దిలివానిపేట వద్దకు వెళ్లే సరికి సడన్‌గా బైక్‌తోపాటు రోడ్డుమీద పడిపోయాడు. దీంతో తల వెనుక భాగాన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బైక్‌తో పడిపోవడం చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

యువకులను ఢీకొట్టి కారు పరారు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పీఎస్ సమీపంలో ఉన్న సంతోషిమాత గుడి ఆలయం వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను జిల్లాపరిషత్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టడమే కాక డ్రైవర్ ఆపకుండా వెంటనే పరారయ్యాడు. ఈ ఘటనలో చంద్రశేఖర్ (18)కు ఎడమ భుజం, కాలికి గాయాలయ్యాయని ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు. చంద్రశేఖర్‌ను రిమ్స్‌కు తరలించారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురూ యువకులే కావడం గమనార్హం.

జాతీయ పోటీలకు అక్కాతమ్ముడు



తైక్వాండోలో చిచ్చర పిడుగులు జామి ఇక్షిత, సాక్షిత్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న జామి ఇక్షిత, జామి సాక్షిత్‌లు తైక్వాండోలో అదరగొట్టే ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. జామి కిరణ్, స్రవంతి వీరి తల్లిదండ్రులు. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి, పతకాలతో సత్తాచాటిన వీరిద్దరు మరోసారి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 20,21 తేదీలో నంద్యాల జిల్లాలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు పుదుచ్చేరి వేదికగా జరగనున్నాయి. వీరి రాణింపుపై తైక్వాండో జిల్లా సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక్షిత విశాఖలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సాక్షిత్ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. శ్రీకాకుళం నగరం టౌన్ హాల్‌లో గల స్కూల్ ఆఫ్ తైక్వాండో కోచ్ మజ్జి గౌతమ్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నారు.

‘వందశాతం ఉత్తీర్ణత సాధించాలి’



పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న సమగ్ర శిక్ష మానిటరింగ్ అధికారి లక్ష్మీనారాయణ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇప్పటి నుంచే విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలని, టెన్త్, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లంపై పలు పశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనం, పాఠశాలలోని జీవశాస్త్రం ప్రయోగశాలను పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ కె.వి.రత్నం, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాలకు చెందిన జేకేసీ, కెరీర్ గైడెన్స్ సెల్, విశాఖపట్టణానికి చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు సుమారు 10 కంపెనీలు హాజరయ్యాయి. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 152 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, జేకేసీ కోఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి, శ్రీధర్, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

‘రైతుల సంక్షేమమే ధ్యేయం’



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పలాస:

‘ఒకప్పుడు మార్కెట్ యార్డు వద్ద విత్తనాలు, ఎరువుల కోసం గంటల తరబడి నిరీక్షించే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని సదుపాయాలు అందిస్తోంది’ అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.92లక్షలతో నిర్మించిన అధునాతన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు(చిట్టిబాబు) అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని వివరించారు. ప్రస్తుతం పలాస పీఏసీఎస్‌లో 5వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, రూ.29కోట్లతో టర్నోవర్ జరుగుతోందని, ఇది మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, వైస్సార్ సీపీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు, ఉంగ సాయికృష్ణ, మందస ఎంసీసీ డొక్కర దానయ్య, వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మధుకేశవరావు, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల సమ్మె నోటీసు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు మంగళవారం డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ డి.విద్యాసాగర్‌కి సమ్మెనోటీసును అందజేశారు. సెర్ప్ సీఈఓ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని వారు కోరారు. పలు సార్లు సెర్ప్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. నోటీసు ఇచ్చిన వారిలో డీఆర్‌డీఏ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు చింతాడ రామ్మోహన్‌రావు, నారాయణరావు, తదితరులు ఉన్నారు.

ఐదెకరాల గడ్డి కుప్ప దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న గడ్డికుప్పలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రావివలస గ్రామంలో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహంతో చేసిన పనికి సాధారణ రైతుకు చెందిన సుమారు 5 ఎకరాల గడ్డి కుప్ప దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు మంగళవారం సాయంత్రం రావివలస గ్రామంలో పర్యటించారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బాణసంచా కాల్చారు. ఆ నిప్పు రవ్వలు గ్రామంలోని దాసరి వసంతులకు చెందిన గడ్డి కుప్పలపై పడడంతో గడ్డికుప్పలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోగా నష్టం వాటిల్లింది. పశువుల దాణా కోసం నిల్వ చేసుకున్న గడ్డి కుప్పలు అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. గడ్డి కుప్పలు దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.సుధాకర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. టీడీపీ కార్యకర్తలు ఇలాంటి అత్యుత్సాహ ప్రదర్శనలు చేసి నిరుపేదలను బలిచేయడం తగదని మండిపడ్డారు.

గిరిజన మహిళను ఆదుకున్న 108

మందస: మండలంలోని కొండలోగాం పంచాయతీలో గల గిరిజన గ్రామం అంబుగాం గ్రామానికి చెందిన గర్భిణి సవర జ్యోతిని మంగళవారం 108 సిబ్బంది ఆదుకున్నారు. ఆమె కు మంగళవారం వేకువజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందజేశారు. దీంతో హరిపురం 108 అంబులెన్స్ సిబ్బంది జి.శంకర్, వి.మురళీమోహన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, జ్యోతిని వాహనంలోకి ఎక్కించారు. దారిలోనే పురిటి నొప్పులు అధికం కావడంతో వాహనాన్ని పక్కకు నిలిపి, సిబ్బంది పురుడు పోశారు. సురక్షితంగా ఆడపిల్లకు జ్యోతి జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరితో పాటు ఆశ వర్కర్ సవర ధనలక్ష్మి కూడా ఉన్నారు. 108 సిబ్బంది శంకర్, మురళీమోహన్‌ను గిరిజనులు, ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.

టీడీఆర్ బాండ్లపై సమీక్ష

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం నిర్ణయం మేరకు ప్రతి ఒక్కరికి టీడీఆర్ బాండ్లను(అభివృద్ధి హక్కు పత్రాలు) అందిస్తామని మున్సిపల్‌శాఖ రీజనల్ డైరెక్టర్ జయరామ్ అన్నారు. శ్రీకాకుళంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం టీడీఆర్ బాండ్లకు ఎంతమంది అర్హులు, దాని విధి విధానాలేమిటన్న అంశంపై చర్చించారు. ఇటీవల అనేక మున్సిపాలిటీల్లో నకిలీ టీడీఆర్ బాండ్ల కుంభకోణం బయటపడటంతో దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ కమిటీ వేసింది. దీనిలో భాగంగా సమావేశం జరిగింది. మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్, సంబంధిత మున్సిపల్ కమిషనర్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులు, రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్ స్థాయి అధికారి, సబ్ రిజిస్ట్రార్, సుడా పీఓలు టీడీఆర్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై ఒక అంచనాకు రావాల్సి ఉంటుందని ఆర్డీ అన్నారు. రోడ్డు ఎఫ్‌ఎంబీలో ఇల్లు నిర్మించుకొని ఇప్పుడు రోడ్డు వెడల్పు ద్వారా దాన్ని కోల్పోతే ప్రైవేటు ఆస్తినష్టం కింద రాదని రెవెన్యూ యంత్రాంగం తేల్చాల్సి ఉంటుందన్నారు. అలాగే భవనం లేదా స్థలం కోల్పోతున్నప్పుడు దాని మార్కెట్ విలువను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ సూచించాల్సి ఉంది.

● ఈ మంచుల్లో..

మంచు ముంచెత్తుతోంది. ఉదయం 4 నుంచి 9 గంటల వరకు కమ్ముకుంటున్న మంచుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మామిడి, జీడి పంటకు నష్టం కలుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. – జి.సిగడాం



ఉదయం 6.30గంటలకు పొందూరు- రాజాం ప్రధాన రహదారిలో రైల్వే వంతెనపై మంచు



6.35 గంటలకు పొగిరి- మర్రివలస గ్రామాల్లో మంచు



6.50 గంటలకు పాలఖండ్యాం- మెట్టవలస రహదారిపై పడుతున్న మంచు